క్లుప్తంగా

యుద్ధప్రాతిపదికన డైవర్షన్ రహదారి మరమ్మతులు



కట్టిలేరు(గంపలగూడెం): ఇటీవల కురిసిన వర్షాలతో కట్టిలేరు వద్ద ధ్వంసం అయిన డైవర్షన్ రహదారి మరమ్మతు పనులను సోమవారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. రెవెన్యూ, పోలీస్, ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో పనులను కొనసాగాయి. తెలంగాణా ప్రాంతంలో కురిసిన వర్షాలకు మండలంలోని ప్రధాన నీటివనరైన కట్టిలేరులో ఐదురోజుల పాటు వరద ఉధృతంగా ప్రవహించింది. దీంతో రహదారిపై మట్టికొట్టుకు పోయి పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి ఆదేశానుసారం అధికారులు కాంట్రాక్టర్‌తో మరమ్మతు పనులను చేపట్టారు.

బాలింతలకు బ్రెడ్, పండ్లు పంపిణీ

నూజివీడు: రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగోటౌన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఉన్న బాలింతలకు, శిశువులకు సోమవారం బెడ్‌షీట్లు, జుబ్బాలు, పాల సీసాలు, బ్రెడ్, రస్కులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ అధ్యక్షుడు గొల్లపూడి రవిబాబు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించి పేదలను ఆదుకోవడమే రోటరీక్లబ్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి పీడీ వెంకటరత్నం, కోశాధికారి రత్నాకర్‌రావు, సభ్యులు బోయపాటి ముఖర్జీ, వై రాజగోపాలరావు, మలిశెట్టి శ్రీనివాస్, పసుపులేటి జగన్, పీసీహెచ్ వెంకటేశ్వరరావు, సాయి, భాస్కరరావు, వైద్యులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ మీదుగా వాహనాలను అనుమతించాలి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి నుంచి చనుమోలు వెంకటరావు ఫ్లైఓవర్ మీదుగా గ్యాస్, ఆయిల్ ట్యాంకర్లు, లారీలను అనుమతించాలని హెచ్‌పీసీఎల్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఐడీఏలో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ వర్షాలకు ముత్యాలంపాడు వద్ద సప్తా మరమ్మతులకు గురికావడంతో గొల్లపూడి నుంచి ఫ్లైఓవర్ మీదుగా 24 గంటలు రాకపోకలకు అనుమతించాలన్నారు.

న్యాయవాది హత్యకు నిరసన



తిరువూరు: విజయవాడకు చెందిన న్యాయవాది ఆదిశేషు విఠల్‌బాబు హత్యా సంఘటనకు తిరువూరు న్యాయవాదులు సోమవారం నిరసన తెలియజేశారు. విఠల్‌బాబును దారుణంగా చంపిన దుండగులను కఠినంగా శిక్షించాలని తిరువూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంకురాత్రి జనార్దనరావు, అంకిరెడ్డి అంజన్‌రెడ్డి కోరారు. కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలియజేశారు.

బాలికలను ఉన్నత విద్యకు ప్రోత్సహించాలి



మునునూరు: బాలికలు ఉన్నత విద్య అభ్యసించే దిశగా ప్రోత్సహించడం అభినందనీయమని హెచ్‌ఎం సునీల పేర్కొన్నారు. ముసునూరు చారిత్రక జిల్లా పరిషత్ హైస్కూల్లో హైస్కూల్ ప్లస్ చదువుతున్న విద్యార్థినులు 10 మందికి పాఠశాల పీజీటీ, స్కూలు అసిస్టెంట్ వాణికుమారి, మాణిక్యాలరావు దంపతులు తమ సొంత డబ్బులతో సోమవారం యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ దంపతులను పలువురు అభినందించారు.

నేడు శాంతి ర్యాలీ

ఆగిరిపల్లి (నూజివీడు) : మణిపూర్‌లో జరుగుతున్న దాడులకు నిరసనగా మండలంలోని అన్ని క్రైస్తవ సంఘాలు సంయుక్తంగా మంగళవారం ఉదయం 9.30 గంటలకు ఆగిరిపల్లి ప్రధాన వీధుల్లో శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు పాస్టర్ల కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. మణిపూర్ బాధితులకు మద్దతుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విజయవంతంగా ముగిసిన 'జగనన్న సురక్ష'

గంపలగూడెం మండలంలో 19,097 సర్టిఫికెట్ల జారీ



గంపలగూడెం మండలం మేడూరులో సర్టిఫికెట్లు అందజేస్తున్న తిరువూరు ఆర్డీఓ ప్రసన్నలక్ష్మి (ఫైల్)

గంపలగూడెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల అవసరాలను తీర్చేందుకు చేపట్టిన జగనన్న సురక్ష క్యాంపులు గంపలగూడెం మండలంలో విజయవంతంగా ముగిశాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశానుసారం ప్రజలకు కావాల్సిన ధ్రువీకరణపత్రాలను వలంటీర్ల ద్వారా గుర్తించి అవసరమైన దరఖాస్తు చేయించి, అవసరాలను తీర్చారని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే పలుమార్లు కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగితేకానీ పనులను ముఖ్యమంత్రి చలవతో తమకు ఏమాత్రం కష్టం లేకుండానే పనులు పూర్తయ్యాయని ప్రజలు అంటున్నారు. గంపలగూడెం మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో జూలై ఒకటో తేదీ నుంచి 27వ తేదీ వరకు అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి జగనన్న సురక్ష క్యాంపులను నిర్వహించారు. షెడ్యూల్ ప్రకారం ఆయా సచివాలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు అధికారుల బృందాలు మకాం వేసి ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లను ఆన్‌లైన్ ద్వారా విడుదల చేశారు. 11 రకాల సేవలను ప్రజలకు మెరుగ్గా, పైసా ఖర్చులేకుండా అందించారు. ఇలాంటి సేవలు గతంలో ఎన్నడూ చూడలేదని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

21 గ్రామ సచివాలయాల్లో సురక్ష క్యాంపులు

గంపలగూడెం మండలంలోని 21 గ్రామ సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్షక్యాంపుల్లో మొత్తం 19,097 సర్టిఫికెట్లను ఉచితంగా అందజేసినట్లు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ వైపిచ్చిరెడ్డి తెలిపారు. కంప్యూటరైజ్డ్ అడంగల్ సర్టిఫికెట్లు 122, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 7,193, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు 9,962, బియ్యం కార్డులో సభ్యులు చేరికకు సవరణలు 105, ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానం 529, కొత్త బియ్యం కార్డులు 24, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు కొత్తవి 8, ఆదాయం సర్టిఫికెట్లు తిరిగి జారీ చేసినవి 420, ఇంట్రిగ్రేటెడ్ సర్టిఫికెట్లు తిరిగి జారీచేసినవి 594, ఆర్‌ఓఆర్ 1బీ సర్టిఫికెట్లు జారీచేసినవి 102, రైస్‌కార్డులో కుటుంబ సభ్యుల సవరణ 32, ఇతర సర్టిఫికెట్లు ఆరు జారీ చేసినట్లు వారు పేర్కొన్నారు. ఆయా క్యాంపుల్లో ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహించి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన మందులను పంపిణీ చేశారు.

మ్యారేజి సర్టిఫికెట్ ఉచితంగా చేతికి వచ్చింది



మారేజి సర్టిఫికెట్ ఉచితంగానే చేతికి వచ్చింది. ఇటీవల వివాహం జరుగగా సర్టిఫికెట్ ఎన్నాళ్లకు వస్తుందోనని ఆందోళన చెందాం. జగనన్న సురక్ష క్యాంపు ద్వారా ఏమాత్రం కష్టం లేకుండా అధికారులు సర్టిఫికెట్ జారీ చేయడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం ఈ క్యాంపు ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేసింది

– మోదుగు ఐశ్వర్య, చైతన్యకృష్ణ, అమ్మిరెడ్డిగూడెం, గంపలగూడెం మండలం

ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ ఉచితంగా ఇచ్చారు



అవసరాలకు వినియోగించుకునేలా ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ ఉచితంగా అందజేశారు. ఈ సర్టిఫికెట్‌లో క్యాస్ట్, నేటివిటీ, డేట్ ఆఫ్ బర్త్‌కు సంబంధించిన వివరాలు ఉంటాయి. ఇందుకు కావాల్సిన దరఖాస్తును వలంటీర్లు, సచివాలయం సిబ్బంది ఇంటి వచ్చి పూర్తి చేయించారు. క్యాంపు రోజు సర్టిఫికెట్‌ను ఉచితంగా అందజేశారు.

– కంచపోగు పుల్లమ్మ, అమ్మిరెడ్డిగూడెం, గంపలగూడెం మండలం

ప్రతి సాంకేతిక రంగానికీ ప్రాముఖ్యత ఉంది

మైలవరం: ప్రతి సాంకేతిక రంగానికీ ప్రభుత్వ శాస్త్రీయ పరిశోధన విభాగాల ప్రాముఖ్యత ఎంతో ఉందని బెంగళూరు ఫోర్త్ పారాడిగ్మ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ సైంటిస్టు డాక్టర్ భీమల కాంతారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ ఇన్ రీసెంట్ ఎరా అనే అంశంపై ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గెస్ట్ లెక్చర్ సోమవారం నిర్వహించారు. డాక్టర్ కాంతారావు మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ అండ్ డేటా సైన్స్‌లో నిష్ణాతులు ప్రతి సాంకేతిక రంగానికి ప్రాముఖ్యత ఉందన్నారు. ప్రభుత్వ సీఎస్‌ఐఆర్ సంస్థ సమున్నత కృషి ఎంతో మన దేశానికి ప్రయోజనకరంగా ఉందన్నారు. దేశంలో సీఎస్‌ఐఆర్ సంస్థ వాయువ్య, నీరు, భూమి, రసాయన, గనులు, ఆహార, డ్రోన్, ఐటీనే కాకుండా ఆధునిక రంగాలుగా ఎదుగుతున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్‌లో కూడా ముందంజలో ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు ప్రసంగించారు. కార్యక్రమంలో ఏఐ అండ్ డీఎస్ విభాగాధిపతి డాక్టర్ రమాదేవి పాల్గొన్నారు.

శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులకు మూడో స్థానం

మైలవరం: మైలవరం శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు వీ ఉమిత్, పీ నాగవెంకట నిశాంత్, పీ భార్గవ్, డీ లోహిత్ శ్రీకర్, పీ భవ్యశ్రీ, బి. వెంకట మహి, పార్థసారథిరెడ్డి తయారు చేసి ఇటీవల నాసాకు పంపిన ప్రాజక్టుకు జాతీయ స్థాయిలో మూడో స్థానం లభించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రత్నదుర్గ సోమవారం తెలిపారు. శ్రీచైతన్య విద్యా సంస్థలు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించే లక్ష్యంతో విద్యా బోధన చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను అకడమిక్ కో ఆర్డినేటర్ ప్రసాద్, ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ వినోద్, డీన్ శ్యామ్‌సన్, ఉపాధ్యాయులు అభినందించారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

జి.కొండూరు: నాడు-నేడు పథకం కింద చేపట్టిన పాఠశాలల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ అనురాధ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విద్యాశాఖ సిబ్బంది, హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు, ఎంఈఓలతో సమీక్ష సమావేశాన్ని ఎంపీడీఓ సోమవారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ స్కూలు డ్రాప్ అవుట్స్‌పై దృష్టిసారించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓలు వీరాస్వామి, వెంకటనర్సింహారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ఇబ్రహీంపట్నం: వివిధ అభివృద్ధి పనులకు 14వ వార్డు కౌన్సిలర్ నల్లమోతు లక్ష్మి సోమవారం భూమిపూజ చేశారు. స్థానిక ఆర్సీఎం పాఠశాల వద్ద సిమెంటు డ్రెయినేజీ, రైతుబజార్ వద్ద నుంచి 30వ నంబర్ జాతీయ రహదారి అనుసంధానానికి అప్రోజ్ సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు కౌన్సిలర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు ఎస్.రవి, దయాకర్, బత్తుల కృష్ణ, కె.వెంకటరత్నం, పండు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి పెంచాలి

చింతలపాడు(తిరువూరురూరల్): జగనన్న పాలవెల్లువ పథకం కింద రైతులకు ప్రభుత్వం తగు ప్రోత్సాహకాలను అందిస్తున్నందున పాల ఉత్పత్తి పెంపునకు కృషిచేయాలని తిరువూరు మండలం, చింతలపాడు పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి కోరారు. చింతలపాడులో సోమవారం పాల ఉత్పత్తిదారుల సమావేశం నిర్వహించి జగనన్న పాలవెల్లువ కార్యక్రమ ఆవశ్యకతను వివరించారు. నాణ్యమైన పాల ఉత్పత్తి చేసినవారికి మంచి ధర లభిస్తుందని పేర్కొన్నారు.

సరిహద్దు తగాదా.. వ్యక్తిపై దాడి

నూజివీడు: సరిహద్దు తగాదాలో భాగంగా వ్యక్తిపై ఇనుప రాడ్‌తో దాడి చేయడంతో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండంలోని జంగంగూడెంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు జంగంగూడెంకు చెందిన పున్నం శివకుమార్, కోటపాటి వాసులకు భూమి సరిహద్దు తగాదా కొంత కాలంగా ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి పున్నం శివకుమార్ ఇనుప రాడ్‌తో దాడి చేయడంతో కోటపాటి వాసు తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడ్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి సేద్యం లాభదాయకం

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చంద్రలీల



తిరువూరులో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

తిరువూరు: రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించి సేద్యం చేయడం వలన ప్రజారోగ్యం పాడవడంతో పాటు భూసారం తగ్గిపోతుందని ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రలీల అన్నారు. సోమవారం తిరువూరు నియోజకవర్గంలో 418 మంది సన్న, చిన్నకారు ఎస్సీ రైతులకు పీఎం అజయ్ పథకం కింద మంజూరైన విత్తనాలు, ఇతర పరికరాలను తిరువూరు మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేశారు. రైతులు సాగు ఖర్చు తగ్గించుకోడానికి, నాణ్యమైన దిగుబడి సాధించడానికి ఈ విత్తనాలను అందజేస్తున్నట్లు ఈడీ తెలిపారు. ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున రూ.41.80 లక్షల విలువైన విత్తనాలను పంపిణీ చేస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, తిరువూరు మండల పరిషత్ అధ్యక్షురాలు గద్దల భారతి, వ్యవసాయాధికారి పద్మ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలి



పంటల ప్రదర్శన తిలకిస్తున్న అధికారులు

చాట్రాయి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు ఆరోగ్య రక్షణకు దోహదపడతాయని తహసీల్దార్ విశ్వనాథరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పతుల ప్రదర్శన కార్యక్రమంలో సోమవారం ఆయన మాట్లాడారు. రసాయనిక ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యానికి హానికరమని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దుర్గా ప్రసాదు, ఏఓ శివ శంకర్, ఉద్యాన శాఖాధికారి హేమ పాల్గొన్నారు.

పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలి



ఈక్రాప్ నమోదుపై మాట్లాడుతున్న తహసీల్దార్

ముసునూరు : రైతులందరూ తమ పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకునేలా చూడాలని తహసీల్దార్ దాసరి సుధ సూచించారు. మండల వ్యవసాయాధికారి మధుమోహన్ ఆధ్వర్యంలో వీఆర్‌ఓలు, వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు పంటల నమోదు ప్రక్రియపై సోమవారం శిక్షణ నిర్వహించారు. ప్రతి రైతు తాను పండిస్తున్న పంటలను తమ గ్రామ రైతు భరోసా కేంద్రంలో ఆధార్ కార్డు, పాస్ పుస్తకాలు, ఇతర ఆధారాలతో పంటలు (ఈక్రాప్) నమోదు చేయించుకునే విధంగా చైతన్యపరచాలన్నారు. రుణ సదుపాయాలు, వైఎస్సార్ రైతు భరోసా, పంటలకు నష్టపరిహారం, బీమా సదుపాయం, ఇన్‌పుట్ సబ్సిడీ, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు తదితర పథకాల వర్తింపునకు ఈ క్రాప్ నమోదు తప్పనిసరి అన్నారు. దీంతోపాటు కౌలు రైతులు కార్డులు పొందేలా సహకరించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన దీపిక



భవానీపురం(విజయవాడపశ్చిమ): మహారాష్ట్ర పూనేలో సెకండ్ లెవెల్ – వైజ్ జిమ్నాస్టిక్ ఇంటర్‌నేషనల్ కాంపిటీషన్‌లో కంతు దీపిక సిల్వర్ మెడల్ సాధించింది. ఆదివారం పూనేలో జరిగిన ఈ పోటీల్లో ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ విభాగంలో దీపిక ఈ పతకాన్ని అందుకుంది. అలుగోలు స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొంది పతకాన్ని సాధించిన మొట్టమొదటి విజేతగా దీపిక నిలవడం అకాడమీకి గర్వకారణమని సంస్థ నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఆమె మరిన్ని మెడల్స్ సాధించాలని వారు ఆకాంక్షించారు.

6న జిల్లా యోగాసన పోటీలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఉమ్మడి కృష్ణా జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన జిల్లా యోగాసన పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ ఎల్.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎనిమిది సంవత్సరాల నుంచి 45 ఏళ్ల మధ్య వారికి వివిధ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనదలచినవారు ఆధార్ కార్డ్ జిరాక్స్, జనన ధ్రువీకరణ పత్రం సమర్పించి రూ.150లు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని చెప్పారు. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని వివేకానంద సెంటినరీ హైస్కూల్‌లో పోటీలు నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు 94411 19909 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సీపీఐ ఆధ్వర్యంలో పోరుయాత్ర

రెడ్డిగూడెం: మండలంలోని భూ హక్కుదారులు సీపీఐ ఆధ్వర్యంలో పోరుయాత్ర కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ యాత్ర మండలంలోని కొత్తనాగులూరు నుంచి రెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ ర్యాలీని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ జెండాను ఊపి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ 30 ఏళ్ల నుంచి భూమిపై సాగు చేసుకుంటున్న పేదల స్వాధీనంలో గల సాగు భూములను క్రమబద్ధీకరించి వారి పేర్ల రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసి, సంబంధిత పట్టాదారులకు పుస్తకాలను పంపిణీ చేయాలన్నారు. పేద సాగుదారులందరినీ గుర్తించి పట్టాదారు పాసు పుస్తకాలను ఇచ్చేంతవరకు న్యాయంపోరాటం చేస్తామన్నారు. అనంతరం స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.పాల్‌కు సీపీఐ నాయకులు అర్జీలు అందజేశారు.

3న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మైలవరం: మైలవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల మూడో తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీకుమారి తెలిపారు. మైలవరం మండల పరిషత్ కార్యాలయం సమావేశ హాల్లో ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి అధ్యక్షతన జరిగే సమావేశంలో సభ్యులు తప్పక పాల్గొనాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

'స్పందన' అర్జీలను గడువులోగా పరిష్కరించాలి



స్పందనలో అర్జీలను తీసుకుంటున్న ఏఓ తేజోమణి

నూజివీడు : స్పందన కార్యక్రమంలో ప్రజలు అందజేసిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ టీ తేజోమణి స్పష్టం చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. స్పందనలో మొత్తం 16 అర్జీలు రాగా పరిష్కారం నిమిత్తం వాటిని సంబంధిత అధికారులకు పంపారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ అర్జీలను పరిష్కరించేందుకు వీలు లేకపోతే అందుకు గల కారణాన్ని సంబంధిత అర్జీదారులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ వెంకటరత్నం, డీఎల్‌పీఓ సుందరి, ఏసీడీపీఓ నాగేశ్వరి పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని కాపాడాలి



గుంటుపల్లిలో గిరిజన ఉద్యోగుల సంఘం చేపట్టిన శాంతి ర్యాలీ

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న మారణహోమాలను నిలువరించి, మతసామరస్యాన్ని కాపాడాలని గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అడ్వైజర్ బాలాజీ నాయక్, ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాస్‌నాయక్ అన్నారు. అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మణిపూర్ అల్లర్లపై గుంటుపల్లిలో శాంతియుత ర్యాలీ సోమవారం నిర్వహించారు. గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శులు శివానీ, కృష్ణానాయక్, లక్ష్మి, శారద పాల్గొన్నారు.

మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి



మైలవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థినులు

మైలవరం: మణిపూర్‌లో ఇటీవల మహిళలు, గ్రామస్తులపై జరిగిన దాడులు, అరాచక చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని క్రిస్టియన్ మైనారిటీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బందెల దయానంద్ పేర్కొన్నారు. మణిపూర్ ఘటనలకు నిరసనగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మైలవరంలో ప్రదర్శన నిర్వహించారు. సోషల్ వెల్ఫేర్ రైట్స్ చైర్మన్ బుర్రి ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో డాక్టర్ బందెల దయానంద్, డీజీపీఎస్ వ్యవస్థాపకులు నాగేశ్వరరావు, ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆఫ్ ఇండియా ఏపీ అధ్యక్షుడు అల్తాఫ్ రజా, ఆర్‌కే రాజు, డాక్టర్ యు.జ్ఞాన సుందరి, డాక్టర్ బొడ్డపాటి దాసు, జమలయ్య, రాణి పాల్గొన్నారు.

నూజివీడులో..



చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న పాస్టర్

నూజివీడు: మణిపూర్ రాష్ట్రంలో కొనసాగుతున్న మారణకాండ తక్షణమే ఆపాలని క్రైస్తవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నూజివీడు ఐక్య క్రిస్టియన్ సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్ సర్కిల్ వద్ద నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు సోమవారం పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎల్ఏఎఫ్ దైవజనులు బండి ఐజాక్, ఫాదర్ లాం జయరాజు, నూజివీడు యునైటెడ్ క్రిస్టియన్ ఫెడరేషన్ చైర్మన్ కేటీ ప్రభాకర్‌రావు, దళిత జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు నత్తా నాగేశ్వరరావు, స్టాన్లీ ప్రభాకర్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిల్లా చరణ్, రాచప్రోలు జోనాథన్ పాల్గొన్నారు.

ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో..



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లింలు

నూజివీడు: మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలకు నిరసనగా పట్టణంలో ముస్లింల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం రాత్రి మౌన ప్రదర్శన నిర్వహించారు. దీనిలో భాగంగా చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ముస్లిం ఐక్యవేదిక ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఎండీ మసీవుల్లా, సెక్రటరీ షేక్ మున్నీ, షేక్ మస్తాన్ వలీ, బాషా పాల్గొన్నారు.

యోగాసన పోటీల్లో హీల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

ఆగిరిపల్లి (నూజివీడు) : జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో మండలంలోని తోటపల్లిలో ఉన్న హీల్ ప్యారడైజ్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు ప్రిన్సిపాల్ బి.సాయిబాబు సోమవారం తెలిపారు. ఉయ్యూరులో జూలై 29న యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో 9 బంగారు, 5 వెండి, 2 కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. సీహెచ్ సురేంద్రబాబు, జీ దినేష్, కే వసంత్, ఆర్ జయంతి, ఆర్ కవిత, జీ శ్రావణి బంగారు పతకాలను, ఎం దివ్య, బీ కార్తిక్, ఆర్ అఖిల్, జీ మహాలక్ష్మి వెండి పతకాలను, జీ రోహిత, ఎం జాస్మిన్ కాంస్య పతకాలను సాధించారన్నారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు సీఈఓ అజయ్‌కుమార్, యోగా కోచ్ ప్రభుదాస్, పీఈటీ నాగరాజు అభినందించారు.

ప్రాసెసింగ్ యూనిట్ మామిడి రైతులకు వరం



సదస్సులో మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈ ఏడీ కేఎల్ఎస్‌రెడ్డి

ఆగిరిపల్లి(నూజివీడు): నూజివీడులో ప్రభుత్వం రూ.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న మామిడి ప్రాసెసింగ్ యూనిట్ వల్ల మామిడి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎంఎస్ఎంఈ ఏడీ కేఎల్ఎస్ రెడ్డి పేర్కొన్నారు. ఆగిరిపల్లిలోని పొన్నం కల్యాణ మండపంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు సోమవారం ఈ యూనిట్ ఏర్పాటు, దీని వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5 కోట్ల వ్యయంతో ప్రభుత్వం ఈ యూనిట్ ఏర్పాటు చేస్తుండగా మామిడి మహిళా రైతులు 10 శాతం కంట్రిబ్యూషన్‌ను పెట్టుబడిగా పెడతారని, మిగిలిన 90శాతం ప్రభుత్వం రాయితీ ఇస్తుందని పేర్కొన్నారు. దీనివల్ల నూజివీడు పరిసర ప్రాంతాల మామిడి రైతులకు ఎంతో లాభం చేకూరుతుందన్నారు. ఈ యూనిట్‌లో మామిడి కాయలను పౌడర్ గాను, రసం గాను మార్చి ఇతర దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. పంట కోతదశలో గాలివానలు వచ్చి కాయలు నేలరాలినప్పటికీ రైతుల వద్ద నుంచి అధిక ధరలకు కాయలను కొనుగోలు చేస్తారని, దీంతో రైతులకు నష్టాలు తప్పుతాయన్నారు. సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ కె.సరళ మాట్లాడుతూ ఈ యూనిట్ ఏర్పాటులో వెయ్యి మందికి తగ్గకుండా మామిడి మహిళా రైతులు తమ భాగస్వామ్యాన్ని కలిగి ఉంటారన్నారు. మామిడి ప్రాసెసింగ్ యూనిట్ ఈ ప్రాంతంలోని మామిడి రైతులకు వరమని అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్ విజయరాజు, డీపీఎం లైవ్‌లీహుడ్ విజయకుమారి, డీపీఎం భూషణం, హేమంత్‌కుమార్, రామోజీ, నూజివీడు ఏపీ దయాల రాజశేఖర్, హెచ్ఓ కె.జ్యోతీప్రియాంక, ఏపీఎం బొలగాని రామకృష్ణ, సీసీలు చాట్ల వెంకటరత్నం, లక్ష్మి, అరుణకుమారి, భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు మచ్చా హరిబాబు పాల్గొన్నారు.